క్లుప్తంగా

జరుగుమల్లి జెడ్పీటీసీ భర్త రిచర్డ్స్ మృతి



రిచర్డ్స్ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

జరుగుమల్లి(సింగరాయకొండ): జరుగుమల్లి జెడ్పీటీసీ చంద్రలీల భర్త జడ రిచర్డ్స్ చిర్రికూరపాడులోని స్వగృహంలో గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఫోన్ ద్వారా చంద్రలీలను పరామర్శించి ధైర్యం చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి రిచర్డ్స్ భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రిచర్డ్స్ మృతదేహానికి శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.గ్రామ నాయకులు జగదీష్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

సింగరాయకొండ: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 6న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ కట్టా శోభారాణి అధ్యక్షతన జరిగే సమావేశానికి జెడ్పీ వైస్ చైర్మన్, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల, గ్రామస్థాయిలో అధికారులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న సీఐ భీమానాయక్

పామూరు: వినాయక ఉత్సవాలను శాంతియుతంగా, సామరస్యంగా నిర్వహించుకోవాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ ఎం భీమానాయక్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం సాయంత్రం ఏఎస్సై ముల్లా అధ్యక్షతన శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ భీమానాయక్ మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా పొందాలన్నారు.విగ్రహాల వద్ద ఎలాంటి పేలుడు వస్తువులు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా కమిటీలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం నిమజ్జన ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలించారు.

లైబ్రరీ అభివృద్ధికి కృషి చేస్తాం



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న ఆదిలక్ష్మి

మర్రిపూడి: లైబ్రరీ అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక గ్రంథాలయాన్ని గురువారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. పాఠకులకు విలువైన పుస్తకాలు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని లైబ్రరీని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు ఇచ్చారు. ఆమె వెంట గ్రంథపాలకుడు సత్యన్నారాయణ, ప్రధానోపాధ్యాయులు రెబ్బా వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సుజనా

హనుమంతునిపాడు: స్థానిక పీహెచ్‌సీని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజనా గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీలు, కాన్పులు, రికార్డులు, వ్యాక్సినేషన్, మందులు, ఆస్పత్రి పరిసరాలను పరిశీలించారు. ల్యాబ్‌లో టైఫాయిడ్, డెంగీ, మలేరియా, సుగర్ పరీక్షలు చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య సిబ్బంది గ్రామాల్లో, ఆస్పత్రి పరిధిలో అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలన్నారు.

ప్రత్యామ్నాయ పంటలు వైపు మొగ్గు చూపాలి

టంగుటూరు: పొగాకు రైతులు ఇతర ప్రత్యామ్నాయ పంటలు జనుము, జీలుగు, పిలిపిసర పంటలు వేసి కలియ దున్నితే అధిక దిగుబడులు సాధించవచ్చని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధరలు చూసి బ్యార్నీ, భూములను అధిక ధరలకు తీసుకు తీసుకోవద్దన్నారు. వచ్చే సీజన్‌లో ఇదే ధరలు కొనసాగకపోవచ్చన్నారు. జమ్ములపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 840 బేళ్లను వేలానికి తీసుకురాగా 747 బేళ్లను కొనుగోలు చేసి 93 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.195, సరాసరి రూ.312 పలికింది. వేలంలో 45 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు



పామూరు కేజీబీవీలో సర్వేపల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



ఆనికాలపల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు



హనుమంతునిపాడులో హెచ్‌ఎం సుబ్బారావుని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

● ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

కనిగిరి రూరల్:

ఉపాధ్యాయ దినోత్సవాన్ని మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించారు. గురువులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యతని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. విశ్రాంత హెచ్‌ఎం వేమూరి చెంచు రామశాస్త్రిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పావని మురళీ, ఏలూరి నాగేశ్వరరావు, బచ్చలి భాస్కర్, ధూళిపాళ్ల మల్లికార్జునరావు పాల్గొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో సర్వేపల్లి రాధకృష్ణ చిత్రపటానికి నివాళులర్పించి, ఎంఈఓ యువీ నారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. దివ్యాంగ విద్యార్థులకు నోట్‌బుక్‌లు, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. డాక్టర్ పుల్లయ్య, ఐఈఆర్ టీసీలు సైమన్, గోపాల కృష్ణ పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ పి.రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జేవీవీ నాయకులు గయాజ్ మాట్లాడుతూ సర్వే పల్లి రాధకృష్ణన్ నేటి తరం విద్యార్థులకు ఆదర్శప్రాయుడన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ వి.రామరాజు, అధ్యాపకులు ఖాశింపీరా, బి.రవింద్ర, కె.సురేష్ నాగమణి, పాల్గొన్నారు. ఆల్ఫా విద్యా సంస్థల్లో, ఐకిడ్స్ స్కూల్‌లో గురుపూజోత్సవం నిర్వహించారు. విద్యా సంస్థల అధినేత జి.మాలకొండారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పామూరు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని, నేటి ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకోవాలని జీహెచ్‌ఎస్ హెచ్‌ఎం రామస్వామి, కేజీబీవి ఎస్‌ఓ కటకం సజన అన్నారు. గురుపూజోత్సవాన్ని స్థానిక జీహెచ్‌ఎస్, కస్తూర్బా, భవిత భవన్‌తో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. తొలుత



కనిగిరిలో గురువులకు సన్మానం చేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక జీహెచ్‌ఎస్, కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం, భవితభవన్‌తో పాటు మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు.

సీఎస్‌పురం(పామూరు): మాజీరాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ స్ఫూర్తితో నేటి ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి వృత్తికి పేరుప్రతిష్టలు తేవాలని జీహెచ్‌ఎస్ హెచ్‌ఎం షేక్.ఖాదరున్నీసాబేగం, ఆనికాలపల్లి ఎంపీపీఎస్ హెచ్‌యం జే.భారతి అన్నారు. గురుపూజోత్సవాన్ని సీఎస్‌పురంతోపాటు మండలంలోని పలుగ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

హనుమంతునిపాడు: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం బీవీ సుబ్బారావు ఉపాధ్యాయ దినోత్సవం గురించి వివరించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

వెలిగండ్ల: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గణేశునిపల్లి పాఠశాలలో హెచ్‌ఎం కత్తి లలితా భాగ్యంను మహిళా ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. స్థానిక



గణేశునిపల్లిలో హెచ్‌ఎం లలితాభాగ్యాన్ని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఎమ్మార్సీలో ఎంఈఓ దాసుప్రసాద్‌ను సర్పంచ్ టి.సురేష్ సన్మానించారు. వెలిగండ్ల ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రులు హెచ్‌ఎం చల్లా సత్యనారాయణను సన్మానించారు.

కొండపి (సింగరాయకొండ): స్థానిక కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సూనన్నకుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యా కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శర్మ, ప్రధానోపాధ్యాయడు, ఉపాధ్యాయులను సన్మానించారు.

పొన్నలూరు: నేటి తరం ఉపాధ్యాయులు సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఆదర్శపాయుడని పలు పాఠశాలల హెచ్‌ఎంలు కొనియాడారు. మండలంలోని అన్ని ప్రాథమిక, పాథమికోన్నత, జెడ్పీ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి పాఠశాల్లో ముందుగా సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలపాడు కేజీబీవీ పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించారు.

మర్రిపూడి: ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ గురు



దస్తగిరిని సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు

పరంపర ఎంతో విశిష్టమైందని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురుపూజోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులు మాణిక్యంశాస్త్రి, వెంకటేశ్వర్లును సన్మానించారు. సర్పంచ్ కె.భాస్కర్, మండల పరిషత్ పరిపాలనాధికారి షేక్ ఖాశింపీర, సీనియర్ అసిస్టెంట్ సయ్యద్ సుకూర్, ఇనుకొల్లు మాదిరెడ్డి, ఈ రవిప్రసాద్, పద్మజ,శేఖర్, సునీల్‌లు పాల్గొన్నారు.

టంగుటూరు: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని టంగుటూరు, జమ్ములపాడు, కొణిజేడులో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కనిగిరి రూరల్: గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కనిగిరి మండలానికి చెందిన ఎస్‌కే దస్తగిరి, ముక్కు నాసరారెడ్డి, పఠాన్ జాన్‌బీలకు గురువారం సన్మానించారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఈఓ సుభద్ర చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని, అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.



ముక్కు నాసరారెడ్డిని సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు



మాలపాడు కేజీబీవీ పాఠశాలల్లో నివాళులర్పిస్తున్న సిబ్బంది



మర్రిపూడిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంపీపీ వాకా వెంకటరెడ్డి



టంగుటూరులో ప్రభుత్వ కళాశాలలో గురుపూజోత్సవం

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



అవార్డు అందుకుంటున్న ఈశ్వరి



అవార్డు అందుకుంటున్న ఇ.సరోజనమ్మ



జి.రత్నమ్మ,



సీహెచ్.సునీతాదేవి



ఎన్.వెంకటరామయ్య

సీఎస్‌పురం(పామూరు): గురుపూజోత్సవం సందర్భంగా ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఈఓ సుభద్ర చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు అందుకున్నారు. మండలంలోని శీలంవారిపల్లికేవీఎల్‌ఎన్ నగర్ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ అసిస్టెంట్ ఎన్.వెంకటరామయ్య, కోవిలంపాడు ఎంపీయూపీఎస్ ఎస్‌జీ సీహెచ్.సునీతాదేవి, దర్శిగుంట్ల ఎంపీపీఎస్ ఎస్‌జీటి ఇ.సరోజనమ్మ, డి.జి.పేట ఎంపీపీఎస్ ఎస్‌జీటి జి.రత్నమ్మలకు ప్రసంశాపత్రం, మెమెంటో అందజేసి వారిని ఘనంగా సన్మానించారు.

పీసీపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న గద్దం ఈశ్వరి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు అందుకున్నారు.

మర్రిపూడి: మండలంలోని గార్లపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తూగుట్ల బిక్షాల్ రెడ్డి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్నారు.



గార్లపేట హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు భిక్షాల్‌రెడ్డి

వరద బాధితులకు దద్దాల చేయూత



వరద బాధితులకు పండ్లు, పాలు, అల్పాహారం అందచేస్తున్న దద్దాల ట్రస్ట్ బృందం

● 5 వేల మందికి నిత్యవసరాలు అందజేత

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ తన ట్రస్ట్ ఆధ్వర్యంలో వరద బాధితులకు గురువారం చేయూతనందించారు. విజయవాడలోని 43వ డివిజన్‌లోని వరద బాధిత ప్రాంతాల్లో దద్దాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుమారు 5,000 మంది నిర్వాసితులకు పండ్లు, పాలు, బ్రెడ్లు, వాటర్ బాటిళ్లు, పులిహోర ప్యాకెట్లు పంపిణీ చేసి సేవాగుణాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలతో వరద బాధితులకు తన వంతు సహాయం అందించినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు సాయం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విజయవాడ 43వ డివిజన్ కార్పొరేటర్ కోటిరెడ్డి మాట్లాడుతూ వరద బాధితులకు అండగా నిలబడటాన్ని కొనియడారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు నాగిరెడ్డిపల్లి సర్పంచ్ స్వర్ణ ఏడుకొండలురెడ్డి, పొంకం చిన్న యోగి, అల్లాటపల్లి ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ముకుందారెడ్డి పాల్గొన్నారు.

అందరికీ ఉపాధి కల్పించాలి

కనిగిరి రూరల్: ఉపాధి హామీ పథకంలో లేబర్ బడ్జెట్‌ను పెంచి గ్రామాల్లో అందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఎంపీడీఓ ఎంపీఎల్ హనుమంతరావు అన్నారు. స్థానిక ఎన్ఆర్‌ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ హనుమంతరావు మాట్లాడుతూ ఉద్యాన పంటలు కింద కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని, కాలనీ గృహాలు నిర్మించుకునే వారికి పనిదినాలు కల్పించాలని సూచించారు.

నేత్రదానంతో జీవితాలకు వెలుగు



నేత్రదాన హామీ పత్రాన్ని అందచేస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: నేత్రదానంతో ఇద్దరి జీవితాలకు వెలుగు వస్తోందని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. స్థానిక ప్రభుత్వ వైద్య శాలలో జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల సందర్భంగా కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో చైర్మన్ గఫార్ మాట్లాడుతూ నేత్రదానం పై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలన్నారు. ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ అబ్దుల్ కలాం, వైద్యులు వెంకట సుబ్బయ్య, యోషితారెడ్డి, చంద్రష్, సృజన కుమారి పాల్గొన్నారు.

మానవత్వానికి నిలువెత్తు రూపం మదర్‌థెరిస్సా

కనిగిరి రూరల్: మదర్ థెరిస్సా వర్ధంతిని గురువారం కనిగిరిలో ఘనంగా నిర్వహించారు. మదర్ థెరిస్సా సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ జోసఫ్ స్కూల్ ఎదురుగా ఉన్న ఫాతిమా మాత బాలుర వసతి గృహంలో థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ థెరిస్సా సేవాసమితి ఆధ్వర్యంలో చేపడుతున్న సేవాహిత కార్యక్రమాలను కొనియడారు. ఫాదర్ ఎం హృదయ రాజ్ మాట్లాడుతూ మానవత్వానికి నిలువెత్తు రూపం మదర్‌థెరిస్సా అని కీర్తించారు. థెరిస్సా సేవా సమితి సభ్యుడు కోఆప్షన్ సభ్యుడు గూడూరి అబ్రహం లింకన్, ఆర్ఎంపీ వైద్యుడు డి.చెంచులు ఆర్థిక సాయంతో వసతి గృహంలోని విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో థెరిస్సా సేవాసమితి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ ఎన్ రసూల్, పసుపులేటి అరుణోదర్, వాగిచర్ల వెంకటేశ్వర్లు, నాదేళ్ల నరసింహారావు, బీసీ సంఘ నాయకులు ఈర్ల విజయరామ రాజు, డాక్టర్ పచ్చవ శేఖర్, చిన కాశయ్య, బొట్టు శ్రీను, కోమటి గుంట్ల బాబురావు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

కనిగిరి రూరల్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం సీపీఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో విరాళాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పీసీ కేశవరావు, నరేంద్ర, బషీరా, ప్రసన్న, లక్ష్మీ, శాంతకుమారి, వెంకటమ్మ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం విధిగా తీసుకోవాలి



పౌష్టికాహార ఆవశ్యకతపై వివరిస్తున్న సూపర్‌వైజర్ పార్వతి

పామూరు: గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల తల్లులు విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని రావిగుంటపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు ప్రారంభించారు. ఈందసర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ అధిక పౌష్టికాహారం ఉన్న ముడిధాన్యాలు, పండ్లు, ఆకుకూరలు తినాలని సూచించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించి అనంతరం పౌష్టికాహారం పంపిణీ చేశారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



చెరుకూరులో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ రమాదేవి

పొన్నలూరు: గ్రామాల్లోని గర్భిణులు, బాలింతలు బలమైన పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో మండంలోని చెరుకూరులో గురువారం భాగంగా గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు స్థానికంగా దొరికే ఆకుకూరలు, పండ్లు, పప్పు దినుసులు ఆహారంగా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు.

పొగాకు అక్రమ అమ్మకాలు నేరం



వేలాన్ని పరిశీలిస్తున్న ఒంగోలు ప్రాంతీయ నిర్వహణాధికారి లక్ష్మణరావు

కొండపి (సింగరాయకొండ): పొగాకు అక్రమ కొనుగోలు, అమ్మకాలు చట్టరీత్యా నేరమని ఒంగోలు ప్రాంతీయ అధికారి లక్ష్మణరావు అన్నారు. కొండపిలో జరుగుతున్న వేలాన్ని ఆయన పరిశీలించారు. బోర్డు అనుమతించిన పరిధిలో పొగాకు సాగు చేయాలని, అనధికార బ్యారెన్లు నిర్మించరాదన్నారు. వేలంలో అన్ని గ్రేడ్లకు మంచి ధర ఇవ్వాలని సూచించారు. 2024-25 ఏడాదికి రెన్యువల్ చేస్తున్నారని, రైతులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం రిజిష్టర్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఎస్ఎస్‌జీఓ జే.తులసి, వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ పాల్గొన్నారు. స్థానిక వేలం కేంద్రంలో పొగాకు సరాసరి ధర రూ.299గా నమోదైంది. కట్టావారిపాలెం, నర్సింగోలు గ్రామాలకు చెందిన రైతులు 1321 బేళ్లను వేలానికి తీసుకురాగా 1126 బేళ్లను కొనుగోలు చేసి 195 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.190, పలికింది. వేలంలో 17 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.